# అతిభాష మతిహాని, మితభాష అతిహాయి

**అతిగ భాషించు శూరత్వమధికమయ్యె**
**కార్యశూరత శూన్యమై కరిగిపోయె**
**బ్రతుకు లాడంబరాలతో భ్రాంతియాయె**
**నేటి విద్యార్థి బ్రతుకీపాటిదాయె.**

విద్యార్థులారా!

ఈనాటి విద్యార్థులయొక్క పరిస్థితి చాలా అయోమయస్థితిలో ఉంటున్నది. మాట్లాడేవాడు చదవలేడు. చదివేవాడు మాట్లాడలేడు. దీనినే నేను అప్పుడప్పుడు హెచ్చరిస్తుంటాను. Less talk more study అని. మానవతా విలువ లీనాడు మరుగున పడిపోతున్నాయి. అసలు ఈనాడు మానవునిగా మానవుడు కనిపించటం లేదు. యోచించటం ఒకటి, ఉచ్ఛరించటం మరొకటి, ఆచరించటం ఇంకొకటి. కనుకనే మానవుడీనాడు అమిత భాషణలతో కాలము వ్యర్థము చేస్తున్నాడు. మానవునికి అనుగ్రహించిన ఈ దివ్యశక్తిని దివ్యపవిత్రతను తాను కోల్పోతూ వస్తున్నాడు. అధికముగా మాట్లాడేకొలది అతనియందు జ్ఞాపకశక్తి నశిస్తున్నది. ఇంతేకాకుండా ఏకాగ్రత కూడా క్షీణించి పోతుంది. తద్వారా మానవుని శరీరమందున్న దివ్యమైన శక్తినికూడా కోల్పోతున్నారు. అధికంగా మాట్లాడటం చేత ఆకలి అధికమవుతుంది. ఆకలి అధికమయ్యే కొలది భుజించటం అధికం చేస్తున్నాడు. అధికంగా భుజించటం చేత తాను మత్తుడైపోతున్నాడు. ఈ మత్తుడు కావటంచేత ఏపనియందు శ్రద్ధను తాను అలవరచుకోటం లేదు. ఎట్టి సేవలయందు తాను పాల్గొనుటకంగీకరించడు. కనుకనే ఈనాటి యువకులందు సేవాభావము అత్యవసరం. సేవలు చేయవలెనన్న మితంగా భుజించాలి. అతి తిండి మతి హాని మిత తిండి అతి హాయి.

**జగత్తునందు భగవంతుడొక్కడే మంచి స్నేహితుడు**

sri sathyasaivachanamrutam

వల్లభాయి పటేల్ చెప్పేవాడు; మితంగా మాట్లాడు. అధికంగా పని చేయి. ఇంతే కాక అతను చక్కగా తన పనిని తాను క్రమశిక్షణతో చేస్తూ పోయేవాడు. ఇతనిని అందరు ప్రాక్టికల్ మాన్ అన్నారు. విదురుడు కూడా మౌనం కన్నా మించిన శక్తి మరొకటి లేదన్నాడు. అందువలనే ప్రాచీన ఋషులు మౌనమును అవలంబించి మౌనముద్ర చేతనే దివ్యత్వాన్ని పొందగల్గుతూ వచ్చారు. ఆధ్యాత్మిక శక్తి కూడా ఈ మౌనంచేత అభివృద్ధి గాంచుతుంది. అతిగా మాట్లాడటం చేత మానవునిలో ఒక నెర్వస్‌నెస్ బయలుదేరుతుంది. దానివలన ఏది మాట్లాడాలో ఏది మాట్లాడకూడదో అనే విజ్ఞతాశక్తి కూడా కోల్పోతూ ఉంటాడు. ఎంత మితంగా మనం మాట్లాడితే అంత సేవలో మనం పాల్గొనగలుగుతాం.

అయితే ఈ సేవలందు అనేక విధములైన మిత్రత్వాన్ని కూడా అభివృద్ధి గావించుకోవచ్చు. ఈ మిత్రత్వం అంటే ఏమిటి? కేవలం 'హలో హలో' అని ఒకరికొకరు పలకరించుకోటం కాదు. అన్ని సమయములందు, అన్ని పరిస్థితులందు, అన్ని రంగములందు తాను ఐకమత్యముతో పనిచేయటానికి పూనుకోవాలి. ఇట్టి మైత్రి తత్వము లోకంలో మనం విచారించి చూస్తే ఎక్కడా కనిపించటం లేదు. సుహృత్ భావము అన్నారు. సుహృత్ అనగా మంచిస్నేహితుడు. ఎవరు? ఈ జగత్తునందు భగవంతుడే good friend. తండ్రి, తల్లి, భార్య, భర్త, కుమారుడు ఎవరైనప్పటికి అంతో ఇంతో స్వార్థము స్వప్రయోజనము లక్ష్యమునందుంచుకొని ఇతరులను ప్రేమిస్తారు. ఎట్టి స్వార్థము లేక, ఎట్టి స్వప్రయోజనము లేక ప్రేమించేవాడు భగవంతుడొక్కడే. ఎట్టి ఫలితము తానాశించడు. ఎవరినుండి తాను ఏమీ అందుకోడు. అందించటమే తన లక్ష్యము. అందుకోటం అతని లక్ష్యము కాదు. అట్టి దైవత్వము మనం పొందాలనుకున్నప్పుడు సరైన నడతను, సరైన గుణములను మనం అలవరచుకోవాలి.

దైవం ఎక్కడున్నాడని మనం విచారిస్తే తనకు తానే గుర్తించటానికి చక్కగా అవకాశం కల్గుతుంది. ఎవరైనా నీ స్నేహితుని నీవెక్కడున్నావంటే ఫలాన రోడ్డులో ఫలాన ఇంట్లో ఉన్నానని చెప్పవచ్చు. తను ఉన్న నివాసముయొక్క ఎడ్రసు ఇవ్వవచ్చు. కాని అక్కడ నివసించే దెవరు? కేవలం ఉపాధి మాత్రమే నివసిస్తూ ఉంటుంది. కాని దేహమే తానా? తాను నివసించేదెక్కడ?

మన హృదయమందే నివసిస్తున్నాడు. ఆ హృదయమునకే ప్రేమ అని పేరు. ప్రేమయందే నివసిస్తున్నాడు ప్రతి మానవుడు. ప్రేమ చేతనే తన నిత్యకర్మలు తాను ఆచరిస్తున్నాడు. తెల్లవారి మొదలు రాత్రి పరుండినంతవరకు ప్రేమ చేతనే తన కాలము సార్థకము గావించుకుంటున్నాడు. కనుక ప్రేమయే తన నివాసము. అట్టి ప్రేమ అనే నిజమైన ఎడ్రసు కనుకొన్నప్పుడు మానవుడు సరైన ప్రవర్తన చేతను, సరైన గుణముల చేతను ఆదర్శవంతమైన మానవునిగా తీర్చిదిద్దుకోగలడు. మాటల చేతలచేత, నడతలచేత, ప్రవర్తనలచేత కొంతవరకు శీలమును పోషించుకోవచ్చును.

**మానవులు తమ ప్రవర్తన చేత సుఖదుఃఖములను తామే కొని తెచ్చుకుంటారు**

ఒకానొకప్పుడు బాబా షిరిడీలో ఉంటున్నప్పుడు దాసుగణు అనే భక్తుడు ఉండేవాడు. అతను పోలీసు డిపార్టుమెంటులో పని చేసేవాడు. శ్రీరామ నవమి, మొహరం రెండు కూడి వచ్చినప్పుడు షిరిడీలో రెండు పండుగలు కలిపి జరిపేవాడు బాబా. అక్కడ హిందు, మహమ్మదీయులకు కొంత వ్యత్యాసం కనిపిస్తూ వచ్చింది. ఆ సమయంలో దాసుగణు డ్యూటీపై షిరిడీవచ్చాడు. అప్పుడు బాబా దాసుగణును మాట్లాడించి 'దాసుగణు! నీకు బాగా పాడేది తెలుసు కదా, ఒక పాట పాడు', అన్నాడు. చక్కగా శ్రవణానందముగా పాడాడు దాసుగణు. తరువాత 'బాబా! నన్ను ఇక్కడే మీరు ఉంచుకోకూడదా!' అని ప్రార్థించాడు దాసుగణు. 'ఎవరు వద్దన్నారు. తప్పక ఉండవచ్చు. ఇది నాయొక్క ఇల్లా, నాకేమి స్వంతం లేదు. నీవు కూడా ఇక్కడ నివసించవచ్చు. కానీ నివసిస్తావా నీవు! అని బాబా ప్రశ్నించాడు. 'తప్పక నేను ఇక్కడే వచ్చి నిలచి పోతాను'. తరువాత మాట మరచిపోయాడు. పండుగ అయిన తక్షణమే డ్యూటీని వదలి తన స్వగ్రామం వెళ్లాడు. వెళ్లే సమయంలో నమస్కరించి 'బాబా! నేను మూడు సంవత్సరములనుంచి ప్రమోషనుకోసం చాలా బాధపడుతున్నాను. కేవలం గౌరవ నిమిత్తం నేను బాధపడుతున్నాను గానీ ధనం కోసం గాని, కేవలం పదవికోసం కాని కాద'న్నాడు. 'అయితే ప్రమోషను వస్తేనే వస్తావా' అన్నాడు బాబా. 'ప్రమోషను అందిస్తే ఇక్కడే వచ్చి నిలచిపోతాను' అన్నాడు, దాసగణు. 'సరే, పొమ్మ'న్నాడు, బాబా. అక్కడనుండి వచ్చి డ్యూటీలో జాయిన్ అయిన వారంరోజులలో ప్రమోషను వచ్చింది. సర్కిల్ ఇన్స్పెక్టరు అయ్యాడు. తరువాత

srisathyasaivachanamrutam

ఈ పనిలో బాబాకు ఇచ్చిన మాట మరచిపోయాడు.

ఒక సంవత్సరం రెండు సంవత్సరములైంది. తరువాత తిరిగి మొహరం, శ్రీరామనవమి డ్యూటీపై వచ్చాడు. 'దాసుగణూ! మరచినావా నీవు ఇచ్చిన మాట' అడిగాడు బాబా. 'మరువలేదు స్వామీ మరువలేదు. చక్కగా పనిచేసి నేను ఎస్.పి. కావాలని ఆశ ఉంటున్నది', అన్నాడు. సరే పొమ్మన్నాడు. తాను తిరిగి వచ్చేలోపల ఆస్టేషనులో ఎక్కడో దొంగిలించిన బంగారు వస్తువులు ఉన్నాయి. కడపటికి ఎస్.పి. వచ్చి ఎంక్వయిరీ చేసాడు. ఈ వస్తువులన్నీ ఎక్కడ నుండి వచ్చాయి? ఎవరు తెచ్చిపెట్టారు. దాసుగణు నాకేమీ తెలియదన్నాడు. నీవు ఇన్‌చార్జిగా ఉన్న ఆఫీసులో ఈ సామానులన్నీ నీయొక్క అనుమతి లేకుండా ఎలా వచ్చి చేరాయి? నీవే దొంగిలించావు అనే నెపము అతనిమీద పడింది. దానిపై అనేక ఎంక్వైరీలు జరిగాయి. అప్పుడు నేనిచ్చిన మాట తప్పటంవల్ల నాకీ అపవాదులంతా పడుతున్నాయనే సత్యాన్ని గుర్తించి రిజైన్ చేసి షిరిడీ వచ్చి చేరిపోయాడు దాసుగణు. దైవము ఎన్ని విధములుగా కాపాడుతున్నప్పటికి మానవుడు తానిచ్చిన మాట మరచిపోవటంచేత తనకై తాను అనేకవిధములైన కష్టములు కొనితెచ్చుకుంటున్నాడు. సుఖములు గానీ, దుఃఖములు గానీ మరొకరు అందించేవికావు.

ప్రతి ఒక్కరు తమ తమ సంకల్పములచేత, తమ తమ ప్రవర్తనలచేత సుఖములను, దుఃఖములను తామే కొని తెచ్చుకుంటున్నారు. 'పాప మనగ వేరు పరదేశమున లేదు. తాను చేయు పనుల దగిలియుండు' కానీ మానవుడు ఈ సత్యము గుర్తించుకొనలేక ఈ సుఖదుః ఖముల కారణము పరులపైనెట్టి పరులవలనే ఇవి ప్రాప్తిస్తున్నాయని నిందిస్తున్నాడు, మానవుడు. ఒక్కొక్క సమయమందు మానవుని దుష్కర్మలచేత దుర్బుద్ధులు అమితమై అనేక కష్టములకు గురౌతూ ఉంటారు.

**విద్యార్థి విషయార్థి కాకూడదు**

మహాభారతయుద్ధ సమయమందు అర్జునుడు అనేక విధములుగా కృష్ణుని వత్తిడి చేశాడు: "కృష్ణా! నీవు రాయబారము చేసి, వారు యుద్ధమునకు సిద్ధమా లేక ఐక్యతకు సిద్ధమా అనే విషయం తెలుసుకొని రమ్మ"న్నాడు. పాండవులలో కడపటివాడైన సహదేవుడు గొప్ప భక్తుడు. ధర్మరాజు, అర్జునుడు, భీముడు కృష్ణుని రాయబారిగా పంపుటకు ఒప్పుకున్నారు. కానీ,



srisathyasaivachanamrutam

సహదేవుడు అంగీకరించలేదు. కృష్ణునిపై ప్రేమ, అభిమానం చేత కృష్ణుని ఈ దుర్మార్గుల దగ్గరకు ఎట్లా పంపాలి అనే భావము అతనిలో వచ్చి అనేక విధములుగా విచారిస్తూ వచ్చాడు. కృష్ణుడు హస్తినాపురము పోయి వచ్చేంతవరకు సహదేవుడు నీరైనా త్రాగలేదు. నిరంతరము కృష్ణచింతనచేతనే కాలము గడుపుతూ వచ్చాడు. తిరిగి వచ్చాడు కృష్ణుడు. 'అర్జునా! యుద్ధము తప్పదు. నీవు వెనుకంజ వేయవద్దు. వారందరు యుద్ధమునకే అంగీకరించారు' అన్నాడు. సహదేవుడు వెళ్లి కృష్ణుని రెండు చేతులు పట్టుకున్నాడు.

**బావను హస్తినాపురము పంపెడిచో నిదమిత్థమంచు నా**
**భావములోని భావమును స్పష్టము చేయదలంచియున్ శుభం**
**బావకు సంధియాత్ర కశుభంబని మ్రింగితి మిన్నకుంటి మా**
**బావ సుఖంబుగా దిరిగివచ్చెనిదే పదివేలు నేటికిన్.**

అనుకున్నాడు. మా బావను హస్తినాపురము పంపటము మంచిది కాదనుకున్నాను. వద్దు అని చెప్పటానికి నోరాడలేదు. కానీ నాలో నేను మా బావకు అన్నీ శుభము కావాలని ప్రార్థించాను. తిరిగి శుభముగా కృష్ణుడు తిరిగి వచ్చాడు. ఇదే పదివేలు అన్నాడు. పరమభక్తుని భావము, పరమభక్తుని ప్రవర్తన ఇంత పవిత్రముగా ఉంటాయి. అర్జుననికి కూడా కృష్ణునిపై అభిమానమే! కానీ యుద్ధాభిమాని. ఇంకొకతూరి హస్తినాపురము వెళ్లివస్తానన్నాడు కృష్ణుడు. అర్జునుడు సహించలేదు.

**కుటిల బుద్ధుల కౌరవులు తిరిగి మన పొత్తుకొత్తురా?**
**అగ్నిలో మల్లెపూలు వెదజల్లు లీల ముష్కరుల మ్రోల నీ**
**హితోక్తులు మేలా? గుణజాల! ఏల ఈ సంధి మాటలిక గోపాలా?**
**ఉత్తర దక్షిణ ధ్రువములు కలియునా?**
**యుద్ధమునకు సిద్ధమనక కాలహరణమిక ఏల?**

"కాలము వ్యర్థము చేయవద్దు. కృష్ణా! యుద్ధమునకు సిద్ధము అని చెప్పు. కృష్ణా! ఉత్తర దక్షిణ ధ్రువములు కలుస్తాయా? ఈ రెండింటికి తూర్పు పడమరలు అడ్డువస్తాయి. ఈ రెండు కలవటానికి వీలులేదు" అని చెప్పాడు. శూరత్వము యవ్వన వయస్సులో ఉట్టిపడుతుంది.

sri sathyasai vahamrutam

యువకుల హృదయము ఈ విధంగా ఉంటుంది. ఆనాటి కృష్ణుని వయస్సు 76 సంవత్సరములు. అర్జునుని వయస్సు 74 సంవత్సరములు. అప్పుడు 76, 74 యవ్వన వయస్సు. భీష్మునికి 112 సంవత్సరములు. Commander in chief గా ఉంటున్నాడు. కారణం ఏమిటి? ఆనాటి ఆహార, విహారములే బలమునకు మూలకారణము. దీనికి విరుద్ధముగా ఈనాటి ఆహార, విహారములు దినదినమునకు మానవుని వృద్ధుని గావిస్తున్నవి. అంతేకాక, అనవసర భావములను తలకు చేర్చుకుంటున్నాడు. ఈనాటి యువకుడు విద్య నిమిత్తము విద్యాలయములో ప్రవేశించి విషయార్థిగా మారిపోతున్నాడు. విద్యార్థి విద్యార్థిగానే ఉంటుండాలి. విషయాలలో ప్రవేశించకూడదు. విషయములలో ప్రవేశిస్తే విద్య నాశనమవుతుంది. ఏది ప్రకాశము నందించునో అది విద్య. విద్యార్థి ప్రకాశవంతమైన జ్ఞానములోనే గాని మరొక దానిలో ప్రవేశించకూడదు. ఈనాడు అమిత మాటలచేత తన శక్తిని కోల్పోతున్నాడు. జీవితమంతా ఉండవలసిన ఇంద్రియశక్తి 18, 20 సంవత్సరములకే కోల్పోతున్నాడు. విద్యార్థి తన దివ్యమైన ఇంద్రియ శక్తిని కాపాడుకోవాలి. చిన్న చిన్నపిల్లలే కంటికి అద్దాలు వేసుకుంటున్నారు. ఈనాడు చిన్నవారే చెవులకు యంత్రాలను పెట్టుకుంటున్నారు. ఏమి కారణము? కలి ప్రభావమా? ఇది కలిప్రభావము అనుకోటం వీలుకాదు. తన బలహీనతే దీనికి కారణం. తనకు అవసరమైన విషయములలో మనసు పెట్టక అనవసర విషయములలో అమితంగా విచారము చేస్తున్నాడు. ఈ విచారము కేవలము కారణము లేని విచారము. దాని వల్లనే బాధ పడుతున్నాడు. దీనికి రూపము ఏమిటి? What is the shape of worry? It is mentally created fear only. అంతే తప్ప చింతకు రూపమే లేదు.

**పరులకు ఉపకారము చేయుటలో పట్టుదల ఉండాలి**

విద్యార్థులారా! మీరు ధైర్యసాహసములచే గుణమును పోషించుకొని నడతను పెంచుకొని ఆదర్శవంతులుగా తయారుకావాలి. హృదయములోని ప్రేమ తత్త్వమును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. అది దైవత్వము. మనలోని భావములు విలువ లేనివి. మసిబొగ్గు వంటివి. ఇలాంటి బొగ్గుకోసమని మాణిక్యమువంటి మన శక్తిని పాడుచేసుకోటం మంచిది కాదు. మనలో క్రోధము బయలుదేరుతుంది. అసూయ వస్తుంది. అహంకారము వస్తుంది. ఇవన్నీ కేవలము

sri sathyasai vahini

మసిబొగ్గువంటివి. ఏమాత్రము విలువ లేనివి. ఇలాంటి విలువ లేనివాటికి విలువైన క్షమను, విలువైన శాంతిని, విలువైన బుద్ధిని పాడుచేసుకోటం తగదు. అదే పూర్వం P.P.P. అని చెప్పాను. P - Purity. P - Patience, P -Perseverence. ఈ మూడింటిని కాపాడుకుంటూ రావాలి. పవిత్రత మనలో బయలుదేరితే శాంతము మనలో ఆవిర్భవిస్తుంది. ఎక్కడ పరిశుద్ధమో అక్కడ ప్రశాంతము. ప్రశాంతి, పరిశుద్ధము చేరితే పట్టుదల మనలో ఆవిర్భవిస్తుంది. మంచివాటిపై ఈ పట్టుదల ప్రవేశపెట్టాలి. పరులకు చెడ్డ చేసేదాంట్లో పట్టుదల ఉండకూడదు. పరులకు కీడు చేసేదాంట్లో పట్టుదల ఉండకూడదు. పరులను బాధించేదాంట్లో పట్టుదల ఉండకూడదు. పరులను హింస చేసేదాంట్లో పట్టుదల ఉండకూడదు. పరులకు ఉపకారము చేయుటలో పట్టుదల ఉండాలి. పరులను ఆనందపెట్టే దానిలో పట్టుదల ఉండాలి. దివ్యత్వము సాధించాలనే దానిలో పట్టుదల ఉండాలి. కానీ ఈనాటి యువకులు ఆవేశము వచ్చిన తక్షణమే కార్యరూపములో ప్రవేశిస్తారు. పెద్దలకుగానీ, పిన్నలకుగానీ తొందరపాటు ఉండకూడదు. శాంతముగా కార్యములో ప్రవేశించాలి. మంచి చెడ్డలు రెండు కూడను విచారించాలి. మొట్టమొదట is it right or wrong అని విచారించాలి. Right అని conscience ఒప్పుకుంటే తప్పక ప్రవేశించాలి. ఇంకొకరి witness అక్కరలేదు. నీ conscience నీకు witness. అదే చిత్. అదే awareness. అదే conscience, పదములు వేరువేరుగానీ వస్తువు ఒక్కటే. వస్తువు ఒక్కటే అయినా అనేక పనులు చేయటం చేత అనేక రూపములు ధరిస్తుంది. ఒకే బ్రాహ్మణుడు వంటచేస్తే వంట బ్రాహ్మణుడంటారు. పూజ చేస్తే పూజారి బ్రాహ్మణుడంటారు. పంచాంగము చెబుతే పంచాంగం బ్రాహ్మణుడంటారు. ఒకే బ్రాహ్మణుడు. చేసే పనిని పురస్కరించుకొని పేర్లు మారుతుంటాయి. సత్‌కి సమీపములో ఉండేది చిత్. సత్‌ని నిరూపించేది చిత్. ఇది టంబ్లరు. దీనిని ఏది నిరూపిస్తున్నాది? వెలుగే దీనిని నిరూపిస్తున్నాది. ప్రకాశింపచేస్తున్నది. అదే రీతిగా సత్‌ను చిత్ ప్రకాశింప చేస్తున్నది. సత్ being ఉన్నది. ఎప్పుడూ ఉన్నది. ఎట్టి మార్పులేక ఉన్నది. ఎప్పుడూ ఉన్నదని ఈ చిత్ నిరూపిస్తున్నది.

నేను అప్పుడప్పుడు చెబుతుంటాను. 4 'F'లు. Ist F- follow the master. ఎవరు నీ మాస్టర్. నీ conscience నీ మాస్టర్, గురువు, దైవము. నీ conscience ను

sri sathyasaivachanamrutam

నీవు follow చేయి. 2nd F- face the devil. దుర్గుణములకు, దురాలోచనలకు ఏమాత్రము వెఱువకు. 3rd F- fight to the end. 4th F, finish the game. అనగా చేపట్టిన కార్యమును సక్రమంగా పూర్తిచేయి. ఏమైనా కానీ పట్టుదల చేత సాధించటానికి పూనుకోవాలి.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టు నెగ్గెడుదాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలచియుండు**
**అడిగిన దేదియో అడగనే అడిగితివి**
**అడిగిన దిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరుపడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేగాని మధ్యలో ఆపివేసి**
**తిరిగి పోవుట భక్తుని దీక్ష కాదు.**

**కర్మాచరణకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలి**

అదే దీక్ష determination. పట్టుదల. ఆ పట్టుదల దేనిపై ఉండాలి? పవిత్రమైన దానిపై పరోపకార సంబంధమైన దానిపై ఈ పట్టుదల ఉంటుండాలి. Help ever, hurt never. ఈ విధమైన దానిలో విద్యార్థులు పట్టుదల పట్టాలి. దీనికి సరైన మిత్రత్వము సంపాయించుకోవాలి. ఆ మిత్రుడు ఎవరు? దైవమే. దైవమే నిజమైన మిత్రుడు. ఏవిధమైన ఫలాపేక్ష లేక, దేనిని ఆశించకుండా, ఏమీ కోరకుండా సర్వకార్యములందు సహాయము చేసే హస్తము భగవంతునిది. ఎప్పుడు helping hand. అట్టి సహాయము మనం కోరాలి.

ఒకనాడు అడవిలోనున్న జింకలన్నీ చేరి ఒక conference జరుపుకున్నాయి. ఈ

conference లో జింకల అధ్యక్షుడు ఒక ప్రతిపాదన చేశాడట. "ప్రియమైన జింకలారా! మనము కుక్కలకంటె ఏమి తక్కువ? మన పరుగు ఏమాత్రము కుక్కలకు లేదు. మనము శక్తి, సామర్థ్యములలో కుక్కల కంటె తక్కువ కాదు. మనకంటె కుక్కలు ఎగరలేవు. మనకంటె ఎక్కువ పరుగెత్తలేవు. మనది సాత్వికాహారము. వాటిది తామసికాహారము. ఆహారములోగానీ ప్రవర్తనలోగానీ కుక్కలు నీచమైనవి. జింకలను భగవంతుడు ప్రేమిస్తాడు. సాత్విక హృదయులము. శారీరకంగా శక్తి సామర్థ్యములు కలవారము. మనము కుక్కలకు ఎందుకు భయపడాలి? కుక్కలకు మనం భయపడకూడదు, నేటి నుండి" అని ఒక నిర్ణయము తీసుకున్నాయి. అన్ని జింకలు 'తప్పక' అని అనుకున్నారు. కానీ అడవిలో ఒక కుక్క గట్టిగా అరచింది. కుక్క అరిచేటప్పటికి సమావేశములో ఒక్క జింక లేదు. అన్నీ పరుగెత్తి పోయాయి. ఏమిటి ఈ నిర్ణయములు! కార్యరూపము పెట్టేటప్పటికి అంతా పరార్! ఈనాటి మాటలుకూడా అట్లాగే ఉంటున్నాయి. మాటలధికంగా ఉంటుండకూడదు. పనికి పరార్ తిండికి తయార్, కాదుకాదు. పనికి తయార్. తిండికి పరార్. ఆ విధంగా ఉండాలి. కర్మాచరణకు ప్రతిక్షణము సిద్ధంగా ఉండాలి.

**సద్భావములు, సదాలోచనలు, సత్ప్రవర్తనచేత దైవానుగ్రహము కొరకు పాటుపడాలి**

ఈ వయస్సు చాలా పవిత్రమైన వయస్సు, మాధుర్యమైన వయస్సు. ఈ వయస్సును చెడగొట్టుకోకూడదు. వ్యర్థము చేయకూడదు. దుస్సంగములో మనము ప్రవేశించకూడదు. దుర్భావములు ప్రవేశింపనీయకూడదు. సత్సంగములో ప్రవేశించి, సద్భావములచేత, సదాలోచనల చేత, సత్ప్రవర్తన చేత, సచ్చింతన చేత దైవానుగ్రహమునకు పాటు పడాలి. ఎలాంటి తల్లిదండ్రులైనా కుమారుడు మంచిపేరు తెచ్చుకోవాలని ఆశిస్తారు. మంచి క్లాసు, ర్యాంకు రావాలని ఆశిస్తారు. ఈనాడు చూస్తే ర్యాంకులంతా ఉంటాయి. కానీ ప్రవర్తన చూస్తే blanks. పూర్తి విరుద్ధముగా ఉంటున్నది. కాదు కాదు. అన్నింటియందు ర్యాంక్ రావాలి. ఇంకే విధమైన రిమార్క్సు రాకూడదు. ఎప్పుడొస్తాయి ఇవన్నీ? అతి భాషచేతనే దుర్గుణాలన్నీ అభివృద్ధి అవుతున్నాయి. ఎవరినైనా మనం కలసినప్పుడు హలో హలో How are you? Good bye అంతే. ఇంక అమితంగా మాట్లాడకూడదు. అమితంగా మాట్లాడుతూ పోతే

srisathyasaivachanamrutam

ఇంకా ఏమేమి వస్తాయో మనలో నుండి. అమితభాష వలన మనం బలహీనులౌతాము. ఈ బలహీనత వల్ల చేయవలసిన కార్యాలలో శక్తిని సాధించుకో లేకపోతున్నాము. కనుక విద్యార్థులు మితముగా మాట్లాడి అమితంగా చదివి అధికమైన మార్కులు తెచ్చుకోవాలి. మితంగా మాట్లాడటం వలన మనలో పవిత్రమైన భావాలు ప్రవేశిస్తాయి. పవిత్రమైన కార్యాలలో ఈ దేహాన్ని మనము ప్రవేశపెట్టుకుంటాము. మాటలచేత అనవసరమైన మాటలు వస్తుంటాయి. తద్వారా శ్రవణం చేస్తాము. శ్రవణం చేసింది క్రియారూపములో పెడతాము. ఎవరి విషయంలో కూడా మనం దుర్భాషలు మాట్లాడరాదు. ఎవరిని మనం ద్వేషించరాదు.

**అతిగ భాషించు శూరత్వమధికమయ్యె**<br>**కార్యశూరత క్షీణించి కరగిపోయె**<br>**బ్రతుకు లాడంబరాలతో భారమాయె**<br>**నేటి విద్యార్థి బ్రతుకు ఈపాటిదాయె**

ఇలాంటి చెడ్డపేరు మనం తెచ్చుకోకూడదు. పెద్దలను గౌరవించాలి. గురువులను గౌరవించాలి. తల్లి తండ్రులను ప్రేమించాలి. ఇదే మనం నేర్చుకోవలసింది. ఈ విధమైన పవిత్ర భావాలు మన హృదయంలో ప్రతిష్ఠింప చేసుకోవాలి. అప్పుడే మన విద్య యొక్క ఘనత, విద్యాసంస్థ యొక్క పవిత్రత మనలో చక్కగా ప్రవేశిస్తుంది. విద్యార్థి విద్యార్థిగానే ఉండాలి. జీవితము ఒక నాలుగు అంతస్థుల మేడ. బ్రహ్మచర్యము. గృహస్థము, వానప్రస్థము, సన్యాసము. నాలుగు అంతస్థుల మేడ ఇది. దీనిలో బ్రహ్మచర్యము, విద్యార్థి దశ ఒక పునాదివంటిది. ఈ పునాది భద్రముగా ఉంటే మిగిలిన మూడంతస్థులు భద్రంగా ఉంటాయి. కానీ ఈ పునాది కదిలిపోతే మూడంతస్థులు కుప్పకూలిపోతాయి. కనుక గృహస్థ జీవితంలో ఆదర్శ గృహస్థుడుగా కావాలంటే, విద్యార్థి దశలో మంచి పునాది కావాలి. మంచి పేరును సంపాదించాలి. బయట కూడా మంచి పేరు తెచ్చుకోవాలి. పుత్రోత్సాహం అంటే పుత్రుడు పుట్టగానే చక్కెర పంచుకోటం కాదు.

**గాఢ నిశ్శబ్దములోనే భగవంతుని వాణి వినిపిస్తుంది**

**పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు**<br>**జన్మించగానె పుట్టదు.**

sri sathyasai vachanamrutam

**జనులా పుత్రుని కనుగొని పొగడ**
**పుత్రోత్సాహము నాడు పొందును తండ్రి**

ప్రజలంతా నీ కుమారుడు మంచివాడు, మంచివాడు అంటే ఆ తండ్రికి పుత్రోత్సాహం కలుగుతుంది. అట్టి ఆనందము నందించాలి, తల్లిదండ్రులకు పుత్రులు. అందుకోసమే పుత్రులు కావాలని ఆశిస్తుంటారు తల్లి దండ్రులు. వారి వృద్ధాప్యములో పవిత్రమైన పేరు సంపాయించి ఆనందింప చేయాలని కోరుతుంటారు. అంతేగానీ పుత్రుడు పుడితే చాలని వారు కోరరు. ఎలాంటి తల్లిదండ్రులైనా పుత్రునిపై ప్రేమతో ఉంటారు. దుర్మార్గులైన పుత్రులున్నారు గానీ దుర్మార్గులైన తల్లిదండ్రులు లేరు. అట్టి తల్లి దండ్రులకు తగిన ఉత్సాహ ప్రోత్సాహములనిచ్చే పుత్రుడుగా సార్థక నామాన్ని అందుకోవాలి. మితభాష అతిహాయి. సన్యాస ఆశ్రమమందు మహనీయులు మౌనము వహించి అరణ్యములోకి పోయి, చూడటం, తినటం, మాట్లాడటం యీ మూడింటిని స్థంభింపచేసి ఆ దివ్యమైన శక్తిని అభివృద్ధి గావించుకుంటూ వచ్చారు. అందుకోసమే నిశ్శబ్దములోని బ్రహ్మమే బ్రహ్మ అన్నారు. కన్నులు మూసుకొని ధ్యానములో కూర్చుంటారు. ధ్యానములో కూర్చున్నప్పుడు ఎట్లా ఉండాలి. నిశ్శబ్దముగా ఉండాలి. ఆ నిశ్శబ్దములోనే భగవంతుని వాణి వినిపిస్తుంది. ఈ శబ్దము పెద్దదిగా ఉంటే ఇంక భగవంతుని శబ్దము ఎక్కడ నీకు వినిపిస్తుంది. ఎంత నిశ్శబ్దముగా నీవు ఉంటావో భగవంతుని నడక శబ్దము అంత ఇదిగా వినిపిస్తుంది. కనుక ఒక్క silence is God. ఒక్క తూరి మీరు చక్కగా విచారించండి. చెవులు చక్కగా మూసుకోండి. మూసుకున్నప్పుడు బయలుదేరుతుంది ఓం. అదియే నిశ్శబ్దములోని శబ్దము. నాలుకను బంధించినప్పుడు ఆ శబ్దము బయలు దేరుతుంది. ఆ శబ్దమే బ్రహ్మము. కనుక

**శబ్దబ్రహ్మమయి చరాచరమయి జ్యోతిర్మయి వాఙ్మయి**
**నిత్యానందమయి పరాత్పరమయి మాయామయి శ్రీమయి.**

శబ్ద బ్రహ్మమయి. ఏ శబ్దమది? నిశ్శబ్దములోని శబ్దమే!

**ఇంద్రియములకు విశ్రాంతి అవసరము**

దినమునకు ఒక్కగంట అయినా మనం మౌనం వహించాలి. ఆ మౌనములో మనము

sri sathyasaivacharamrutam

కోల్పోయిన శక్తిని అభివృద్ధి గావించుకోవచ్చు. చూడండి పగలంతా శ్రమపడి పనిచేస్తాము. రాత్రి ఒక్కతూరి నిద్రించగానే ఇంద్రియములన్నీ విశ్రాంతి తీసుకుంటాయి. ఇంద్రియములు విశ్రాంతి తీసుకోటం వల్ల మనం చురుకుగా పనిచేస్తాము. అనగా ఇంద్రియములకు విశ్రాంతి అవసరము. ఈ ఇంద్రియములకు విశ్రాంతి ఇవ్వటం వలన మనకు కూడా విశ్రాంతిగా ఉంటుంది. మనోశాంతే మహత్తరమైన శక్తి. దీనినే వేదాంతపరిభాషలో అమనస్కము అన్నారు. అమనస్కమనగా మనసు లేనిది. ఎప్పుడు మనకు మనస్సు ఉండదు? గాఢ నిద్రలో మనకు మనసు ఉండదు. స్వప్నములో కూడా మనసు ఉంది. స్వప్నములో నున్న మనస్సు అన్నింటినీ సృష్టించుకుంటుంది. తనను తాను సృష్టించుకుంటుంది. కానీ గాఢ నిద్రలో సుషుప్తిలో ఏ మనసు ఉండదు. సు-షుప్తి. గాఢ నిద్ర. అనగా మంచి నిద్ర అన్నారు. స్థూలము, సూక్ష్మము ఈ రెండింటికి అతీతమైనదే కారణము. కారణ స్వరూపమే సుషుప్తి. తరువాత తురీయావస్థ. అదే గాఢమైన తత్త్వము. మహత్తరమైన శక్తి. దీనినే తురీయావస్థ అన్నారు. జాగ్రత, స్వప్నము సుషుప్తి, తురీయావస్థ, నాలుగు స్థానములు. కాని అనేకమంది పిల్లలు నిద్రలో కూడా ఏవో తలుస్తూ ఉంటారు. నిద్రకూడాపోరు చాలామంది. ఈ పరీక్షలు వచ్చాయంటే, నిద్రపోకుండా పరీక్షలపైనే కాలమంతా వ్యర్థం చేస్తుంటారు. ఒక రాత్రి అంతామేలుకొని 20 పేజీలు చదువుతాము. ఏమి ప్రయోజనం? తెల్లవారేటప్పటికి ఒక్క పేజీ అయినా జ్ఞాపకం ఉండదు. కారణమేమిటి? ప్రశాంతమైన నిద్ర నీకు అత్యవసరం. నిద్రను పాడు చేసుకొని చదువుకుంటే మనం ప్యాసుకాము. నిద్రపో. మూడుగంటలకే లేచి చదువుకో. అంతేకాని నిద్రమాత్రం చెరుపుకోకూడదు. తిండి లేకపోయినా ఉండవచ్చు కానీ నిద్ర లేకపోతే బ్రతకటం కష్టం. కనుక నిద్ర చాలా అవసరం. నిద్ర పాడు చేసుకోకూడదు.

విద్యార్థులారా! మీరు అమితంగా మాట్లాడటం తగ్గించండి. అవసరమైన మాటలు మాట్లాడుకోండి. ఎవరైనా ఎదురు పడినప్పుడు 'హలో! హలో!' అని పలకరించండి. నయాపైస ఇచ్చి కల్పించుకుంటే నాలుగు వేలిచ్చినా వదిలించుకోలేని సంబంధము కల్పించుకోకూడదు. ఆ విధమైన స్నేహము మనం చేయకూడదు. ఎవరితో విరోధము వద్దు. కాలేజీలో ఎంతకాలం ఉంటారు? మూడు సంవత్సరములో నాలుగు సంవత్సరములో ఉంటారు. కదలిపోయే మేఘములవంటి ఈ కాలములో ఎందుకీ బాంధవ్యమును పెంచుకోవాలి? మంచి పేరు తెచ్చుకో.

sri sathyasai vachanamrutam

తల్లి తండ్రులను సంతోషపెట్టండి. మీరు ఫెయిలైతే తల్లి తండ్రులకెంత బాధ . రెండు సంవత్సరములలో ప్యాం

ం కావలసినది నాలుగు సంవత్సరములు తీసుకుంటే తల్లి తండ్రులకెంత ధన వ్యయమవుతుంది. కాలము వ్యర్థము. మనసుకి కష్టము. ధనము వ్యర్థము. Energy వ్యర్థము. అన్నీ వ్యర్థమైపోతాయి. జీవితమే వ్యర్థమైపోతుంది. కాబట్టి, ఒక్కక్షణమైనా వ్యర్థము చేయకుండా మనం చూచుకోవాలి. మితంగా మాట్లాడటం ఎంతైనా హాయిగా ఉంటుంది. కనుక మనం ఈ జగత్తును చూసి భయపడనక్కరలేదు. మనము దైవప్రీతిని పెంచుకోవాలి. పాపభీతిని పెంచుకోవాలి. పాపమే రాకుండా చూచుకోవాలి.

1996 జూన్ 28వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam